మ॥రా॥ రా॥ శ్రీ                    గారికి.

Reg: No. M.                    సం॥రం. చందా 3—0—0.

# స్వతంత్ర రైతు

ప్రతి శుక్రవారము ప్రకటింపబడును.

సంపాదకుడు:— దేశిరెడ్డి శేషురెడ్డి.

సంపుటం ౧ | ౧౯౩౧ అక్టోబరు తే ౨ ది శుక్రవారము. | సంచిక ౨

## వ్యాఖ్యలు.

జమీన్‌దారి రైతుసంఘమును స్థాపించుటకు ముఖ్యమగు సంకల్పము రైతులకష్టములను బాగుపరచుటకు మార్గములు రైతుల కుండవలసిన సౌకర్యములను స్వాతంత్ర్యమును బడయు మార్గములను అనుష్ఠించుటయు, జమీందారులకు తెలిపి వారి ఉద్యోగుల అక్రమ ప్రవర్తనము రూపుమాపి, సక్రమమార్గముల స్థాపించి పాలనావిధానము సౌమ్యమార్గమునకు త్రిప్పుటకు యత్నించుటయును. మా అభిప్రాయమై యుండినది గాని ప్రస్తుత జమీన్‌దారి రైతుసంఘమున బాధ్యతలేని వ్యక్తులు కొందరు స్వైరవిధానములకు మారు జమీందారుల దూషించుట, అనవసర విషయముల జోక్యము గలిగించుకొనుట, రైతులకుండు కష్టములకు తోడులేని కష్టములను తెచ్చిపెట్టుట రైతులకు ఉద్రేకమును కలిగించుట, లేనిఆశలు కల్పించుట జమీందారులకును రైతులకును గల అన్యోన్యమైత్రికి భంగము అగునట్లు ప్రవర్తించు విధానమును సాగించుచున్నారు. వారివారి స్వంతవిరోధమున్న వారు ప్రత్యేకముగా జమీందారులతో పోరాడవచ్చును. వారి శక్తిసామర్థ్యములను చూపవచ్చును, జయింపవచ్చును. అమాయకులగు రైతుల మోసపుచ్చి వారి స్వలాభ స్వకార్య వ్యక్తి విరోధములకు రైతుల గురిచేయుట చాల అన్యాయము రైతుసంఘము లుండవలసినదే రైతుసభలు చేయవలసినదే రైతుకష్టములను విన్నవించవలసినదే. మన కష్టములను ప్రభువులకు తెలిపి తీర్పవలెనని సక్రమాందోళన చేయవలసినదేగాని అవి న్యాయబాధ్యతలతో గూడి యుండవలెను. చట్టము ననుబద్ధమై యుండవలెను. న్యాయ సమ్మతముగా యుండవలెను. గాని మా సోదరులగు కొందరుండి రేచిపెట్టి జమీను పద్ధతుల నేగాక జమీందారును రూపుమాప యత్నించుట, లేని అవకాశమును గలిగించి రయితులను నాశన మొనర్చుటయు చాలా విచారకరముగా నున్నది.

---

### వడ్లమోపూరు సభలు.

వడ్లమోపూరులో జమీందారీ రయితు సభలు జరుగనున్నవి. అచ్చట సభ పెట్టుటకు కారణము అక్రమముగా రయితులందరిని పోగుచేసి పశువుల నొగదోలి జప్తుచేయించుటకును; శిస్తులు రాజాగారికి చెల్లించకుండ చేయుటకు తెలుపుచున్నారట. ఇట్లు చేయుట నిజమే అయినచో రయితులు సక్రమముగా సభలు జరిపి తమ కష్టములను గూర్చి విమర్శించి తీర్మానములను గావించి రాజాగారికి తెలిపి వెంటనే అమలు పరచకపోయినచో వారు నిరాకరించిన న్యాయపద్ధతులపై ఆందోళన సలుపవలయును. గాని తొందరపడి బాధ్యతలేని వ్యక్తుల ఉపదేశములను విని రయితులే తారుమారు చేయుచో అందులకు బాధ్యులు రయితులే కాగలరు. అక్టోబరు తే ౫ ది నుండి రయితుల కష్టములను గురించియు, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నరయుటకును చేయవలసిన మార్పుల చేయుటకును, జమీందారీ గ్రామములలో నుండు రయితుల కుండవలసిన వసతులను విచారించుటకును శ్రీ రాజాగారిచే నియమింపబడిన విచారణాధికారి బయలుదేరుచున్నారు. ఏ గ్రామములు పోవుచు పద్ధతిని ముందు ఆయా గ్రామములకు తెలుపబడును. అచ్చట విచారణ గ్రామాధికారుల యెదుట జరుగబడును.

---

వెంకటగిరి జమీందారి రైతుమహాసభలు దసరా దినములలో జరుపవలసినట్లు చాలమంది అభిప్రాయములచే 20-10-31 మంగళవారము జరుగునట్లు, యేర్పాటు చేయబడును.

ఆదినం విజయదశమి అగుటచే మహాసభ విజయవంతముగా జరుగుననియు, వ్యయప్రయాసలకోర్చి దక్షిణ ఉత్తర తాలూకా రైతులందరు దయచేయవలయును.

ఆదినమే వెంకటగిరి స్టేటుకాంగ్రెస్ కమిటీ అను వెంకటగిరి శాసనసభ యెన్నికలు జరుగును ప్రతితాలూకానుండి ఇద్దరిని యెన్నుకొనబడును. వీరు ప్రజాప్రతినిధులై రాజాస్థానమున రాజ్యాంగము నంతయు నడుపుచుందురు.

# చంద్రగుప్తుని కాలపు సైనిక పద్ధతులు.

రాజ్యాంగము యొక్క సైన్యములకు క్రమ శిక్షణము కొనుటకు పురాతనము నుండియు భరత వర్షమున గలదు. ఈ పద్ధతి చంద్రగుప్తుని కాలమున చక్కగా ప్రబలియుండెను. నిజము, అతనికి సింహాసనము లభ్యమగుటకు యీ శక్తివంత సైన్యదళములే కారణములు.

## చంద్రగుప్తుని మూలబలములు.

నందవంశీయులలో కడపటి రాజు 200,000 కాల్బలము, 80,000 అశ్వదళము, 8000 రథములు, 6100 గజములు గలిగియుండెను అని ఒక కథ చెప్పుచున్నది. అది గ్రీకులు అనునట్లు మగధ రాజునకు 200,000 కాల్బలము 20000 అశ్వదళము, 2000 నాల్గు గుఱ్ఱముల రథములు, 3000 ఏనుగులను ఉండెనని చరిత్రకారులు. అంకెలలో కొంత భేదము నున్నను ఒకటి మాత్రము నిజము. చంద్రగుప్తుడు తన పూర్వపు రాజవంశమునకు గొప్ప సైన్యమును వశపరచుకొన్నట్టు స్పష్టమగును. చంద్రగుప్తుడు తన సైన్యమును ఇంకను పెంచి, కాల్బలమును 600,000 చేసి, సైన్యాధికులను నియమించి, ఉత్తర హిందూస్థానమునంతటిని దిగ్విజయము గావించెను. గజములను 9000 వరకు పెంచి వానిలో 500 సైన్యాధికులను బహూకరించెను.

ఇంత పెద్ద సైన్యములను పాలించుటకు ఎంతో చతురుల రాజ్యతంత్రము కావలెను. అంగ విభాగము, సైన్య విభజనము, పురాతనము నుండియు గలదు. మూల బలముల కాలమునుండి, సైనికోద్యోగుల పద్ధతి గలదు. గాని చంద్రగుప్తుని కాలములో రకరకముల వారి సైన్యములుండెను. పారంపర్య సైన్యములు, భృతక సైన్యములు, సైన్య సహాయములు, మిత్ర సైన్యములు, అటవి జాతులవారు, బ్రాహ్మణ సైన్యములు, క్షత్రియ సైన్యములు, వైశ్య సైన్యములు శూద్ర సైన్యములు నుండెను.

## సైనికోద్యోగుల పద్ధతి.

ఈ విషయమున అర్థశాస్త్రములో నిట్లున్నది. గజములు, తురగములు, రథములు, పదాతులు, ప్రతి దళమునకు, వర్గాధిపతులుండిరి. ఒక దళమునకే అనేక అధికారులుండుట చేత, ఒకరిపై నొకరికి కక్ష్యలుండుట చేత, పనిలో నొకరి సహాయము సైన్యము ప్రతి పని మీదికి కొంత ఆలస్యము. ప్రతి 10 పదాతులకు ఒక సేనాపతియు, 10 సేనాపతులకు ఒక నాయకుడును ఉండిరి. సర్వ సేనా నాయకుడు యుద్ధరంగమును నడుపుటకు సర్వాధికారి. చక్రవర్తి సైనికులు కూడ సైనిక శిక్షణము పొందుచున్నారా లేదా యని మాత్రము పరీక్షించువాడు. దినపు పర్యవేక్షణ యంతయు అప్పుడు వారి చేతిలో ఉండెడిది. రథ గజ, తురగ పదాతి సైన్యముల అధికారులకే క్రొత్తగా చేర్చుకొనుటకు, శిక్షణ మొసగుటకు, తమతమ శాఖలవారి హాజరు పట్టీలు వేయుటకు అధికారము గలదు.

## సైన్యమునకు వేతనములు.

సైన్యముల జీతముల విషయము వలసినంత అధికారము గలదు. దొరతనపు నౌకర్ల వేతనముల గూర్చి అర్థ శాస్త్రమునందు ప్రత్యేక ప్రకరణము గలదు. సర్వ సేనాధిపతి, రాజ పురోహితుడు, ముఖ్య ప్రధాని, గురువు, యువరాజు, రాజమాత, రాణి అందరకు సమాన వేతనములుండెను. వారికి వత్సరమునకు 48000 పణముల జీతము, పదివురు, సేనాపతి, నాయకుడు 24000 పణముల వార్షికము; సైన్య నివహముల నాయకులకు, గజాధిపతులకు, అశ్వాధిపతులకు రథాధిపతులకు, 8000 పణముల వార్షికము సైనిక వైద్యునకు. సైనిక శిక్షణాధికారికి 2000 పణముల వార్షికము. శిక్షణ పొందిన ప్రతి భటునకు 500 పణముల వార్షికము ఒసగబడినది. యుద్ధమున మరణించిన యోధుల భార్యలకు, సంతానమునకు దొరతనము వారు సహాయము చేయుచుండిరి. గాని దొరతనము బొక్కసములో ధనము తగ్గినపుడు వీరికి కొంచెము ద్రవ్యమును, కొంత పొలము పశువులు, అడవి ఫలితము ఇచ్చేవారు. అడవి జాతుల వారికి ముడి ధాన్యములు ఇచ్చుచుండిరి.

## సైనిక కార్యాలయ నిర్మాణము.

చంద్రగుప్తుని రణనీతి యుద్ధ కార్యాలయ నిర్మాణమునందు చూడవలసియున్నది. విదేశీయులు ఈ నిర్మాణమును చూచి, ఆశ్చర్యపడుచుండిరి. మెగస్తనీసు దానిని చాలా శ్రద్ధగా పరిశీలించి చక్కగా వర్ణించి యున్నాడు. రాజ్యము యొక్క సైనిక వ్యవహారములు ముప్పదిమంది కమీషనర్లు, 5 మంది ఒక్కొక పంచాయితీగా ఏర్పడి నిర్వహించుచుండిరి. ఒక కమిటీ నావికాదళమును, ఒక కమిటీ యుద్ధసమయమున యుద్ధ యంత్రములు, సైనికుల ఆహారము, ఇతర ముఖ్యవిషయముల నుపయోగించు ఎద్దుల దళములపై అధికారులు. మూడవ కమిటీ వారు కాల్బల గణాధిపతులు. 4 వ కమిటీ గుఱ్ఱములు, 5 వది రథములు, 6 వది ఏనుగులను విచారించ నియమింపబడినది. ఈ విధముగా చంద్రగుప్తుని

కాలమున నాలుగురకముల సయిన్యమేగాక నావికా దళమును, సయినిక సామాగ్రి శాఖయును, చేర్చబడినవి. అర్థశాస్త్ర కారుడు వివరములను విపులముగా వర్ణించి యున్నాడు. పలువిధముల సయిన్యమునకు ప్రత్యేక అధి కారులుండిరి. నావికశాఖ, సామాగ్రి శాఖయును ప్రా ముఖ్య స్థానమునే బడసి యుండెను. ఇవన్నియును, సర్వ సేనాపతి అధికారమునకు లోబడి యుండెను. ఈ సేనా పతి సహాయుడుగు చక్రవర్తికి బాధ్యతగల్గి యుండెను ఇంతేగాక అశ్వశాలలు, గజశాలలు మందుకొట్లు యుద్ధ సామాగ్రిని చేయు కర్మాగారములు నుండినవి. యుద్ధ సామాగ్రి నిర్మాణాధికారి యొక కడపటి శాఖాధికారిగ నుండెను.

### సమర కుంజరములు.

చంద్రగుప్తుని సయిన్యమునందు ఏనుగులకు ప్రాముఖ్య మొసగబడినది. అనాదినుండియు ఏనుగులు సయిన్యములో ప్రధాన శాఖగా నుండెడివి. ఏనుగుల బలము సాధారణముగా జయాపజయములను నిర్ణయించుచుండెడివి. దొరతనమువారు ఏనుగుల కడుజాగ్రతతో కాపాడుచుండిరి.

### దుర్గములు.

చంద్రగుప్త రాజ్యములో దుర్గములు ప్రాముఖ్యత నొందియుండెను. దొరతనము వారు సర్వరక్షణార్థము కోటలను జాగరూకతతో కాపాడుచుండిరి. రాజ్యమున నలుదెసలను కోటలు నిర్మించబడుచుండెను. జల దుర్గములు, పర్వత దుర్గములు ఎడారి దుర్గములు అడవి దుర్గములు అర్థశాస్త్రములో గలవు. దుర్గములు చెడుస్థితిలో నుండినచో అవి రాజ్యమున కష్టదాయకములని కౌటిల్యుడు వ్రాసియున్నాడు,

---

## ఖద్దరు ధరలు తగ్గింపు,

శ్రీ గాంధి మహాత్ముని జన్మదినమగు అక్టోబరు 2 వ తేది నుండియు ఖద్దరు ధరలను తగ్గించుటకు నిశ్చయించినాము. గజము 1-8-1 అణానుండి 3 అణాల వరకు మారకపు ధర నుండి పావలావరకు ధరను క్రమముగా తగ్గించుటకు ఏర్పాటుచేసి తగ్గింపుధరలు అక్టోబరు 2-వ తేదినుండియు అమలులోనికి వచ్చునట్లు మా వివిధ విక్రయశాలలకు ఉత్తరువు లియ్యబడినవి.

ప్రస్తుత ధరల తగ్గింపు అవకాశమును పైకొని జనులందరు గాంధి నామమున కీర్తిగా ఖద్దరుకొని కాంగ్రెసు అధ్యక్షుని హెచ్చరికను సఫలము గావించెదరని కోరుచున్నాము.

ఇందులో కొన్ని ముఖ్యరకములలో ధరల తగ్గింపులను వ్రాయుచున్నాము.

18-20 నంబ్రులో,

| వెడల్పు అంగు | పొడవు | పూర్వపుధర రూపాయలు | తగ్గింపు ధర |
|---|---|---|---|
| 54 | 20 | 13-0 | 12-0 |
| 50 | 18 | 11-8 | 10-8 |
| 50 | 20 | 13-0 | 12-0 |
| 45 | 16 | 10-0 | 9-0 |
| 38 | 14 | 8-8 | 7-8 |
| 27 | 11 | 7-3 | 6-0 |
| 12-16 రెండవరకము | | | |
| 54 | 18 | 10-8 | 9-8 |
| 50 | 16 | 9-3 | 8-0 |
| 45 | 14 | 7-8 | 7-0 |
| 36 | 12 | 6-6 | 6-0 |
| 27 | 8 | 5-0 | 4-8 |
| 8-10 ముతక | | | |
| 36 | 10 | 6-0 | 5-8 |
| 45 | 12 | 7-8 | 6-9 |

వేమూరి నారాయణమూర్తి,
కార్యదర్శి.
ఆంధ్ర చరకా సంఘము, బందరు.

---

## వార్తలు.

శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు నెల్లూరు కాంగ్రెసు కమిటీనుండి రాజకీయ వ్యవహారములలో పాల్గొనని నిశ్చయించుకొనిరి.

◆ ◆ ◆

నెల్లూరు సమీపమున గూడూరున ఈ 5 వ రాత్రి భూకంపము కలిగెననియు చుట్టుపట్ల పరిస్థితులు గాఢనిద్రలో అనేకులు మేలుకొని పరుగులెత్తిరనియు తెలిసినది.

◆ ◆ ◆

పూర్వము ప్రాచీనకాలమున మనుష్యులు 9 అడుగుల యెత్తుగల వారలుండినారని జర్మనీలో ఒక శాస్త్రజ్ఞుడు కనుగొనెను. జ్యూపిటర్ గ్రహమున మనుష్యులు 11 అడుగుల యెత్తుండురని గూడ వారు నిరూపించిరి.

◆ ◆ ◆

[illegible]

◆ ◆ ◆

సర్. అక్బరు హైదరి [illegible]

— — —




# స్వతంత్రరైతు.

౨—౧౦—౩౧

శుక్రవారము.


## గాంధిమహాత్ముని వర్ధంతి.

నేడు గాంధి మహాత్ముని జన్మదినోత్సవము అతి వైభవముగా భరత వర్షమునందంతటను, జరుగుచున్నది. ఈ వర్ధంతి ఏటేట భారతీయులు జరుపుచుండినను, నేడు మాత్రము చరితార్థకమయినది. ఒక భరతఖండమునందే గాక, అమెరికా, యూరోపు ఖండములయందు, మహాత్మునకు వర్ధంతి నేడు జరుగుచుండుట గమనింపవలసిన విషయము. మహాత్ముడొక భారతీయుడను నాయకత్వము వదలి, లోకోత్తర పురుషుడని వలసిన తరుణము వచ్చినది. భరత వర్ష స్వాతంత్ర్యమునకే మాత్రమే గాక, లోక కళ్యాణమునకు జన్మించిన మహనీయుడని, లోకము నేడు గుర్తించినది. రాజకీయ పారతంత్ర్య విమోచనమునకు పశుబలము లేకొనగడంగు బలహీన జాతులవారికి మోక్షమార్గమును, దౌర్జన్య రాహిత్యమును, సత్యాగ్రహమును ప్రదానమునకు తెలుపరచి, నూతన శకమును మహనీయుడు ప్రారంభించి చరితార్థుడయ్యెను. దుర్భర దౌర్జన్య సమాపేతములగు, పశుబల విధానమునకు కాలోచితముగ సర్వాంగ నిర్మాణములను సమకూర్చుకొనుటకు ధనవంతములగు దేశములు పయిలేము భయపడుచున్నవి. దేశపు ఆదాయమున మూడువంతులు పైన సైన్య నివహములకును, మారణాయుధ నిర్మాణమునకును వ్యయమగుచున్నది. ప్రజాభ్యుదయ శిక్షణ లబ్ధి వృద్ధిపరచుటకు ద్రవ్యము కానబడుటలేదు పరరాజ్య కాంక్ష, పరధనాకర్షణము, ఆత్మాది దురాశా పీడితములయి రాజ్యములు తాండవమాడుచుండునపుడు, మహాత్ముని, శాంతి శంఖనినదము తన్మయులయిన రాజనీతి వేత్తల మేధస్సులకు గ్రిమముగా పొలిక సాగినది. శాంతి తత్వమునగల మహాబలమును రాజ్యాంగ వేత్తలు కనుగొన సాగిరి. ఎంత శక్తివంతమయినను, పశుబలమును శాంతిబలము సులభముగా గబళింపగలదని అనుభవైక వేద్యమయినది. నవ నాగరకత యుందగ్రస్థానమును వహించి, నిజభుజబల పరాక్రమముచే లోకమును వణికించిన జర్మని సామ్రాజ్యము నణగగొట్టి లోకములో నెక్కువ విస్తీర్ణముగలిగి రవి అస్తమింపని బ్రిటీషు సామ్రాజ్యము వారి శాంతిబల స్వరూపమును డీకొన జాలరయిరి. భారతీయులం దుద్భవమందిన యీ శాంతియుత మహచ్ఛక్తి, అజాత శత్రువగుటయేగాక, అక్రమమునకును. అన్యాయమునకును, భయంకర స్వరూపియయినది. ఈ తత్వము మహోగ్ర వేగమున లోకమున వ్యాపించుచున్నది. ఈ వ్యాప్తము ప్రాబల్యమగు కొలది పశుబలముపై నిర్మితములయిన రాజ్యములు భయభ్రాంతములై నేలం గూలుచున్నవి.

బ్రిటీషు సామ్రాజ్య రాజ్యాంగవేత్తలు తీవ్ర రాజకీయ సమస్యలను సయితము పాటింపక, పాశ్చాత్యకములగు నవరికపు చిక్కులలో దగుల్కొని తెన్నుగానక తబ్బిబ్బులగుటకు తీవ్రతమమయిన శాంతిసంగ్రామ ఫలితమేనని యెల్లరు నేడంగీకరింపక తప్పదయ్యెను. ఇండియా ఇంగ్లాండుల మధ్య గౌరవ ప్రదమయిన రాజీకుదిరినచో బ్రిటీషువారి ఆదాయ వ్యయపట్టిక సరిపడును గాని, ఆర్థిక శాస్త్రవేత్తల అంకెల గారడీలు సహాయపడవునా యని మహాత్ముడు లండను నగరమున సవాలుచేయుచున్నాడు. అరితేరిన రాజనీతి కోవిదులు పండ్లు తెగబట్టి శరీరము పులకింపచేసి కనుబొమ్మలు ఎరచిన నేమి లాభము? రాజ్యములిక పశుబలముపై నాధారపడు రోజులు గడచిన వనియు, సమరసభావము, ప్రేమ, అన్యోన్య సహనము, సౌహార్దభావము ఇత్యాది ఉత్తమ గుణప్రధానమై విరాజిల్లవలయునుగాని, కామక్రోధ మదమాత్సర్యాదులకిక తావులేదని మహాత్ముడు చాటించుచూ, నూతన యుగమునకు పునాదులను వేయుచు లోక కళ్యాణమున కెదురుజూచుచున్నాడు. రామకృష్ణబౌద్ధాది అవతార మూర్తులకును మహర్షిపుంగవులకు నెలవయిన

యీ భారతభూమి వల్లనొకసారి లోకమునకు మోక్ష శిక్షను ఛీ. పెట్టగల్గినందులకు సరితి ఖ్యాతియును గన్పడవలయును. నాగరికతయని విర్రవీగిన రాజ్యములన్నియు నింకొకసారి మోకాళ్ళపై నిలచి, భారత ధర్మమును స్వీకరించి తరించుగాక. హైందవ తత్వము చిరస్థాయియై యుండుగాక, గాంధితత్వము లోక కల్యాణప్రదమగుగాక.

శాంతిః శాంతిః శాంతిః

---

జమీందారుల వలన రయితులకు గలుగు ననేక బాధలలో ముఖ్యమైనది పన్నుల వసూలుచేయు కాల కాలనిర్ణయము. అకాల నిర్ణయము గావించుటచే, అటు రాజాగారికిని, ఇటు రయితులకును కష్టముగానున్నది సర్కారు గ్రామములలో వసూలు మహాసూలు కాలములో జరుగును. పంటలు పండి ద్రవ్యవసతి యుండు కాలమున రయితును ఒక వేళ ఒత్తిడి చేసినను, ఎటులో ధాన్యమును విక్రయించి సొమ్ము చెల్లించగలడు గాని రాజాగారి వసూలుకాలము సర్వము ఖర్చు అయిన తరువాత సంప్రాప్తమగుచున్నది. నిర్భర దరిద్రుడగు రైతు అవసర ఖర్చులకు పంట నుపయోగించుకొనును. జమీందారీ పన్నులు వెనుకబడును. వసూలు చేయుటకు ఉద్యోగులు కష్టపడవలయును. ఏరోజు అంతయు ఖర్చు పడినందున రయితు కష్టపడును. ఫలితము కోర్టులకెక్కుటయగుచున్నది. నివారణముగా ద్రవ్యమునంతయు కోర్టుల పాల్జేయుటకన్న చట్టమునే సవరించి సర్కారు గ్రామముల పద్ధతినే జమీనుల యందును అవలంబించిన శ్రేయోదాయకము కాగలదు.

ప్రెస్సు బిల్లు కొన్ని సంస్కరణములతో శాసనము గావింపబడుటకు అసెంబ్లియందు ప్రవేశపెట్టబడినది. కొన్ని కోరలు సెలెక్టు కమిటీవారు తీసివేసినను భయంకర స్వరూపము మాత్రము మారలేదు. ఇది కేవలము దౌర్జన్యమునడపుటకేనని, దొరతనపు సభ్యులు ఎంత చెప్పినను లోకము ఎటుల నమ్మగలదు? దౌర్జన్యము నడుపుట యుద్దేశమైనచో, క్రొత్త పత్రికలకు వెలువడకు పూర్వమే ఏల ధరావత్తు కోరవలయును! క్రొత్త పత్రికల హృదయము మండలాధికారు లెటుల కనుగొనగలరు! ధరావతు కోరక వదలుటకు కారణములు మేజిస్ట్రేటు గారు వ్రాయవలయునటగాని, దాక్షిణ్యము పుట్టునని వీరి కెటుల తెలియునో? నిరంతరము ఆశాపూరితుడగు మహాత్మునకు తప్ప మరెవ్వరికిని, త్వరలో భరతవర్షమునకు ముక్తి గలుగ గలదని నమ్మకములేదు.

ఇంగ్లండునందు పరిస్థితులెంత మాత్రమును ప్రోత్సాహకరముగ నుండుట లేదు. మహాత్మునకు సయితము వెంటనే ఇండియాకు బయలుదేరెదనని పలుమారు వాకొనుచున్నారు. విషయములు సరియగు మార్గమున నడుచుచుండినచో. నిట్టి నిరుత్సాహమేల? ఇండియా దొరతనమువారి ఆర్థిక వివరములు, పత్రికా శాసనములును ఇంగ్లండునందలి ఇండియా కార్యదర్శిగారి నూతనపు రేట్లు అక్రమములను, ముసల్మానుల పట్టుదలయును, శుభ చిహ్నములుగ లేవు. గాని, రాజకీయములందారితేరిన మహాత్మునకీ భయంకర తుపానుల మధ్యనుండియే యాశాలతలు గన్పడుచున్నవి. బ్రిటీషు కాళింగునిపై క్రీడించుచు, మహాత్ముడు కోరలనుండి విషమును గ్రక్కించుచున్నారు. ఈ విషమే పత్రికా శాసనము, మార్షలు వ్యూహములు, అధనపు పన్నులు నవి. ఈ విషమనతి కాలముననే ఖర్చయి, స్వాతంత్ర్యోదయము గాగలదు.

---

మహాత్ముని వర్ధంతి, నెల్లూరు టవున్.

స్టోన్‌హవుసు పేట వర్తక సంఘము వారు మహాసభలు, నగర సంకీర్తనలు గావించిరి. సంతపేట బాలుర ఉత్సవము, భజనలు, బీదలకు అన్నదానము గావించిరి. కాంగ్రెసు సంఘము వారు శివరాజావారి సత్రమువద్ద మహా సభ జరుపుదురు. కాలేజి హైస్కూళ్ళ విద్యార్థులు, స్కూళ్ళను చాలించి పతాకోత్సవము చేయుచు ఇతర స్కూళ్ళ వైపుగా నుత్సవము జరిపిరి. ఇతరస్కూళ్ళను మూయబడెను. కోవూరు గ్రామసంఘము వారును మహాసభలు, ఉత్సవములు గావించిరి. ఇక బుచ్చిరెడ్డిపాలెం కావలి ఇతర గ్రామములలోను జరుగుచున్నవని వార్తలు వచ్చుచున్నవి.

శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవము.

మ॥ రా॥ రా॥ శ్రీ కింగరాజు వెంకటసుబ్బరావుగారి శ్రోత్రియం చెల్లయపాలెం గ్రామములో గొప్ప వారి దానుల సహాయముతో జరుపబడును. ధనవంతులు, భక్తులు, యీ గొప్ప మహోత్సవమునకు తోడ్పడవలయునని భక్తజన సేవకులు కోరుచున్నారు.

ఈ సెప్టెంబరు మాసములో శ్రీయుత సేనగుప్త గారు ఆంధ్రదేశ పర్యటనము సాగింతురనియు, ఆ సందర్భమున నెల్లూరునకు వచ్చి లక్ష్మీనరసారెడ్డిగారి పురమందిరమును వెలువరచెదరనియు తెలియుచున్నది.

---

## జమీందారులకు విజ్ఞాపన.

జమీందారులు ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల ననుసరించి చేయవలసిన మార్పుల వెంటనే చేయవలెను. పంటలు ధరలు తగ్గి రయితులు శానుమారయి యున్నారు, ప్రస్తుతము అప్పులిచ్చు బ్యాంకులు వారు అప్పులిచ్చుట నిలిపినందులను పరపతి పుట్టనందునను డబ్బులేక రయితులు చాలా యిబ్బందిలో నున్నారు. ప్రతి ధాన్యమును సరాసరి సగము ధరలు తగ్గుటచే పంట ఫలితము పన్నులకు కూడా చాలకున్నది ఇట్టి పరిస్థితులలో సకాలమునకు పన్ను చెల్లించువారు పరితము బాధల నొందుచున్నారు గాన, యిట్టి తరుణమున ప్రజలకు సహాయము చేయవలసి యున్నది. జమీందారీ గ్రామములలో ప్రభుత్వమువారికి చెల్లించు శిస్తులయినను ఆలశ్యముగా చెల్లించవచ్చునుగాని ఉద్యోగుల మామూళ్ళు వెంటనే చెల్లించతలయును. యిట్టి అక్రమ పద్ధతి వెంటనే రూపుమాపవలయును. రయితులు మామూళ్ళు చెల్లించనిచో ఉద్యోగులు చాడీలు వ్రాసి యేమి బాధలు గలిగింతురో అని భయభ్రాంతులయి యుందురు. కొన్నిచోట్ల గ్రామాధికారులు వసూలైన సిస్తులు చెల్లించుకొని యేకోవక నెలకు వ్రాసి రసీదు ఇచ్చి అసలు చిట్టా జమ వ్రాయక రయితులను వృధాగా కోర్టులకు లాగించుచున్నారు. ఇది అన్యాయముగదా అని అడిగిన మేము యేమి చేసేది కట్టిన శిస్తులకుకూడా రాజాగారు దావా చేయుచున్నారని చెప్పుచున్నారు. ఇట్టి లోపములను సరికేయుట సంస్థానములవారి జవాబుదారియై యున్నది. గాన ప్రభువుల విచారణ సక్రమముగా లేనందున అనేక కష్టములు రయితులకు గలుగుచున్నవి. గాన ముఖ్యముగా మమ్ము పాలించు వెంకటగిరి సంస్థానమువారు వెంటనే విచారణ సలుపుచు జాగరూకత గలిగి రయితులను పీడించు ఉద్యోగులకు తగు శిక్షణ సలుపుచున్న మా బాధలు తీరగలవు. ఇట్టి విషయములు సమాచారమునకు వ్రాసుకొనియు వృధా అగుచున్నందునను, విచారణ లేనందునను కరణములు మునసబులు తమ ఇష్ట ప్రకారము అక్రమముగానే ప్రవర్తించుచున్నారు. సాగుబడి అయిన భూమి దిట్టాలో యెక్కను సాగుగాని భూమి దిట్టా యెక్కను. సంస్థానంవారి ఉత్తరవు ఒకటి అయియున్నను, ఉద్యోగుల ఉత్తరవు మరొకటి అయియున్నను ప్రభువుల పోషణ నిమిత్తం ప్రజలను దైవము సృష్టించెనో ప్రజల సంరక్షణ నిమిత్తం ప్రభువుల సృష్టించెనో గమనించవలెను. మేము దైవ సమానముగా భావించుకొని యున్న మా ప్రభువులు మమ్ము నిరాధారులుగా చేసి అన్యాయమును విచారించకున్నచో మేము యేమికావలయునో ప్రభువులే ఆలోచించుకొనవలెను గాక రయితులు కల్పవృక్షము వంటి వారు. ప్రభువులు కామధేనువువంటి వారు. ఇట్టి అన్యోన్య భావము ప్రకటమయినచో సంస్థానము ఇంద్రలోకమువంటి దగును గాన మాయందు పుత్రవాత్సల్యత మనువక్రమ విచారణలు ప్రారంభింప ప్రార్థించుచున్నారము.

వెంకటగిరి సంస్థానము రైతు.

---

## ఐచ్ఛిక దారిద్ర్యము.

### మహాత్ముడు ప్రపంచమునకు సందేశము నొసగుట.

### ఫ్రాన్సిస్కను స్టడీ సంఘమువారు సభ నేర్పాటుజేయుట.

ఫ్రాన్సిస్కను స్టడీ గిల్డువారు గిల్డుహౌసు చర్చి భవనమున నేర్పాటుచేసిన సభలో గాంధి మహాత్ముడు ఐచ్ఛిక దారిద్ర్యము అనగా బుద్ధి పూర్వకమగు దారిద్ర్యము అను విషయము గూర్చి ప్రపంచమునకు సందేశము నొసగుచు ముపన్యసించిరి.

ఈ సభకు మాడురాయిడను కన్యగా రధ్యక్షత వహించిరి. ఇపుడున్న ధర్మోపదేశకులలో నగ్రగణ్యులగు గాంధిగారు బుద్ధి పూర్వకముగా దారిద్ర్యము నవలంబించిరి అని రాయిడను కన్యగారు నుడివిరి.

సభకు మిక్కిలి హెచ్చుమంది వచ్చి హర్షధ్వానములతో గాంధి గారికి స్వాగత మొసగిరి.

నేను రాజకీయములలో ప్రవేశింప దలచినపుడు బుద్ధిపూర్వకముగానే దారిద్ర్య వ్రతము నవలంబించితిని. సాధారణముగా రాజకీయములలో పనిజేయువారు అసత్యములకును అవినీతులకును ఒడబడవలసి వచ్చును. వాటినుండి తప్పించుకొనుటకే నేనీ పద్ధతి నవలంబించితిని. నేను ధర్మయుతో గూడిన రాజకీయములనే అవలంబించుచున్నాను. నేను నేడొసగుచున్న ఉపన్యాసము కొంతువరకు సభలో నేను జేయబూనిన పనికి సంబంధించియే యున్నది. ప్రపంచములోను ప్రతి మనుష్యుడును ధనవంతుడుగా నుండుట అసాధ్యముగాని అందరును బీదవారుగా నుండుట సులభము ధనము తక్కువయిన కొలదిని కోరికలుగూడా తక్కువ యగుచుండును. వారు కోరుకొనకుండనే దరిద్రులుగా నుండువారికి ఐచ్ఛిక దారిద్ర్యమునుగూర్చి నేను బోధించుటలేదు. ధనవంతులగు వారీ నియమమును బూనినచో అతిప్రమాదకరముగా నున్న జాతీయ ఆర్థిక సమస్య చాల సులభముగా పరిష్కరింపబడుట కవకాశ మేర్పడును. అని మహాత్ముడు నుడివెను.

# జమీనులు నిర్మూలింపవలయునా!

ప్రస్తుతము ఎస్టేటు ల్యాండు ఆక్టులో చాలా అవకతవకలు గలవని ఎల్లరు అంగీకరింపవలసినదే. ఇందు రయితులు దిన దినము అనుభవించు కష్టములు చెప్ప తరముగాదు. గాని ప్రజలు సకరిమాందోళనము గావించి జమీందారుని నిర్బంధపెట్టిన యెడల తమకు గలుగగల సౌకర్యములు పెక్కులై యుండగలవు. అమ్మయైనను అడుగనిది పెట్టునా. బిడ్డల హృదయము నిక్కముగ తల్లి గ్రహించి వేళకు పాలూ నీరు పోయవలసిన విధి అయినను, బిడ్డ ఆకలికాగానే ఏడ్వక పోయినపుడు, తల్లి గంట ప్రకారము తన ధర్మము తీర్చుకొనుటకు బూనినచో బిడ్డకే చెరుపు గలుగుచున్నది. అజీర్ణ బాధ తప్పక సంభవించుట గలదు. ప్రజల తత్వమును గమనింపక, వారికి ఉత్తమోత్తమ పద్ధతులను గరప బూనినను అది వికటింపగలదు. అమనుల్లాగారు నాగరతను ఉత్కృష్టభావములతో తన రాజ్యమున జొప్పింపదలచినను, జీర్ణించుకొన నశక్తులగు ప్రజలకది వికటించినది. అటులే ప్రజలు తమ కష్టము తెలిసి ఆందోళన గావించినపుడు సంస్కరణములు దేశమున చక్కగా నాటగలవు గాని, ఆందోళన లేనపుడు మూరక ప్రవేశపెట్టి నవికటింప గలదు.

తన ప్రజల యందు ప్రతిమాన ప్రేమ సమన్వితముగావున అమనుల్లా ప్రజలు తన కొరకు పోరాడి మడియుటకన్న తాను రాజ్య త్యాగము గావించుట మేలని తలచినాడు. గాని ఇందు కేవలము సంకుచితమగు సాధారణ మానవ వ్యక్తి జీవిత నీతిని పాటించినాడుగాని జనబాహుళ్య సంరక్షణకై పాటింపదగు రాజనీతిని మరచి మేలుచేయ దలచిన ప్రజలకు కీడేచేసెను. జమీందారీల యందును ఇపుడిపుడే మేల్కాంచు రయితులు ద్వేష ప్రేరితులయి పాలకులకు చిక్కులు గల్పించుట సహజము, ఇందుమూలమున సంస్థానములకు కష్టములు సంభవింపగలవు. ఇరు పక్షములవారియందును తాత్కాలిక ద్వేషము గలుగకపోదు. ఇది మానవ తత్వమునకు సహజము అయినను అధికార నిర్వాహకులైన ప్రభువులును, సామాన్య రయితాంగమును నడుప సామర్థ్యము గల నాయకులును, మహదాశయ ప్రేరితులు గావలయును. రయితులు రాజును ఎగరగొట్టవలయునను దుర్బుద్ధులవారు గాకుండ నొక వంకను, ఎట్టి ఆందోళనము గావించినను, రయితు నండను జేర్చి, కష్టముల నన్వేషించి, సంస్కరణముల నొసగి రయితు బిడ్డనోదార్చుట రాజుల ధర్మమునని గ్రహింపవలయును. అఖిలభారత శాసన తిరస్కార సత్యాగ్రహ సమరము గావించిన మహాత్ముడు సిమ్లాలో వైస్రాయిగారి భవనముచుట్టు ఏల తారాడవలసి వచ్చినది. ఒకహస్తమున విజయలక్ష్మి క్రీడించుచున్నను, భండారకములకేగి, పడరాని పాట్లన్నిటిని పడవలయును, ఇరుపక్షములకు శాంతిని కూర్చి న్యాయ స్వత్వములను బడయుచు, లోకకళ్యాణమును గోరియేకదా?

మానవజీవితమున క్షణక్షణము మార్పులుగలుగ నటుల రాజ్యాంగమున జరుగుట దుస్సాధ్యము కాలక్రమమున ప్రజల భావములు గడ్డకట్టి క్రియారూపమును దాల్చినపుడు శాసనబద్ధములు గాకపోవు. శాసన మూర్తిని దాల్చులోపల నెన్నియో పరిణామములు బొందవలయును. ఇదియెరిగియు నాయకులు ఆతురత జూపుట సహజము. చూపనిచో కార్యము ముందుకు జరగి వెనుకబడగలదు. ఈతత్వము నెరిగి, రైతాంగమును, సంస్థానాధిపతులును ఓరిమిని బడవలయును.

గడచిన వెంకటగిరిసభల ఫలితముగ నిరుపక్షములందు తీవ్రరోషానలజ్వాలలు, పొంగి పొరలుచుండునట్లు వినబడుచున్నవి. రైతులపక్షము వారు తమపట్టుదల బలపరుచుకొనుటయు, నెదిరి పక్షమువారు తమ కనుకూల పద్ధతులను గావించుకొనక తప్పదు. ఇది సహజము. అయ్యును తమ గమ్యస్థానము మాత్రము ఇరుకక్షలు మరువక భావతరంగడోలికల యందు జాగరూకులై క్రీడింపవలసియుండును.

జమీందారీల నన్మూలింప జేయవలయునని గావింపబడిన తీర్మానమును, అవలంబనకుదే రయితులు గడంగి లెదను గణ్యమైన వినాశకర పద్ధతులకు గడంగినచో అమాయకులగు రయితులు తప్పక బాధపడగలరు. సంపూర్ణ సంఘీభావము లేని యీ తరుణమున పన్నుల నెగగొట్టుట, కంచెల పాటల బెట్టనీకుండ పశువుల నెగదోలుట మొదలగు దౌర్జన్యమునకు అంగ నిర్మాణ మెరుగని రయితాంగమును నాయకులు ప్రోత్సహించినచో తాత్కాలికోపశమనమును జమీందారులు గావించుకొని ఆపదలనుండి విముక్తినొందినను తుదకు దుర్బోధలకు లోనయి అమాయకులగు రయితు చెడిపోవుచున్నాడను పశ్చాత్తాపము వారిని నిరంతరము బాధించుచునే యుండును, రాజనీతిని పాలించునపుడు వ్యక్తులు అన్యాయముగ బాధపడుదురు. ప్రజానాయకులు మాత్రము ఆ కారణముగ నోరులేని రయితాంగమును కష్ట పరంపరల పాల్జేయకుందురుగాక.

# విశ్రాంతిభవనము, నెల్లూరు.

## బైటవారల కిచట గల సౌకర్యము మరెచ్చటను లభ్యపడదు.

ప్రస్తుత ఆర్థిక పరిస్థితులనుబట్టి మా భవనములో భోజన ఛార్జీలు తగ్గించవలయునని మా మిత్రుల వలనను కోరబడుటచే నష్టకష్టములకు వెనుదీయక తగ్గించడమైనది.

కస్తూరిదేవి నెల్లూరు విద్యాలయములో మామూలుగా నొసంగు అన్ని పదార్థములతోటి పూట 1-కి భోజనం 0.4.0 మాత్రమే.

మా భవనములో యేర్పాట్లన్నియు ఆరోగ్యముగను, పరిశుభ్రముగను రుచికరముగను వుండియు సామాన్యులకు సయితము లాభకరముగ వసతి గలుగునట్లు యేర్పాట్లు చేసియున్నాము. ఆంధ్రులు తప్పక మాకు ప్రోత్సాహముచేయ ప్రార్థన.

| | |
|---|---|
| పూట 1-కి భోజనము | 0—4—0. |
| నెల 1-కి భోజనము | 10—0—0. |
| స్పెషల్ భోజనము పూట 1-కి | 0—6—0. |
| మేలురకం కాఫీ కప్ 1-కి | 0—1—0. |

గదులు. స్నానములు, టిఫిన్లు, వగయిరాలకు ప్రత్యేకచార్జీ.

డి. శేషారెడ్డి, ప్రొప్రయిటరు.

# ఆయుర్వేదఫార్మసీ,

## గాంధిచౌక్, నెల్లూరు.

మహాశయులారా!

భారత దేశమున దేవసమానులగు మహనీయులు పరిజ్ఞానసంపన్నులై మహత్తరమగు కృషిసల్పి ఉత్తమములగు ఆయుర్వేద ఔషధ శాస్త్రములను నిర్మించియున్నారు. అట్టి ఉత్తమమగు గ్రంథములు అనేకములుండగా అనేకులు నవయుగ వైద్యులు అట్టి శాస్త్ర పరిశోధన, శాస్త్ర ఆచరణ, అలక్ష్యమనియు, ఆగాయములేదనియు, కృత్రిమ కల్పితశాస్త్రములనుండు చిట్కాలను తాత్కాలికముగా తయారుచేసి ప్రజలను మోసపుచ్చుటయేగాక, ఆయుర్వేద ఔషధ పరిభాషలకును, తత్సంబంధమైన వైద్య గ్రంథములకును తీరని కళంకము నాపాదించుటంబట్టి ఆయుర్వేద ఔషధములు శాస్త్రయుక్తముగా తయారుచేసి, అనుభవయుక్తముగా నొసంగిన యెడల సమస్త కఠిన వ్యాధులను, నిర్మూలను చేయుటకు ఆయుర్వేద ఔషధములకు శక్తిగలదని, తెలుపుటకుగాను ఈ ఫార్మసీని. మా సింహపురమున నెలకొల్పినాము. ఇచ్చట తయారుచేయబడు ముఖ్యమగు ఔషధములను జనసామాన్యము వుపయోగించి దానియొక్క ఫలమును అనుభవింప ప్రార్థన.

ఇచ్చట తైలములు. లేహ్యములు, చూర్ణములు, భస్మములు, మాత్రలు, పర్పటులు, అరిష్టములు, ఆసవములు, రసాయనములు, వంట ఔషధములు, తయారు చేయబడుచున్నవి. కల్తీ ఔషధములను వుపయోగించి లేని కష్టములను తెచ్చుకొనక, మాచే తయారుచేయబడు ఔషధములనే వుపయోగించుడు.

ఆయుర్వేద ఫార్మసీ,
గాంధిచౌక్, నెల్లూరు.

దేశిరెడ్డి శేషారెడ్డి,
ప్రొప్రయిటర్.


Edited and Published by D. Sesha Reddy and Printed at the Simhapuri Press, Nellore.